సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 19 । ఆగస్టు । 2024



తారలు దిగివచ్చే వేళ..

దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలు వచ్చే నెల 5న ప్రారంభమవుతాయి. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయి.

8లో



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల సరుకు వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.3°/23.6°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్



జిల్లా కార్యవర్గాన్ని సత్కరించిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) సంఘం జిల్లా అధ్యక్షుడిగా పుట్టపర్తి ఏఈఓ ఆనంద్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు ప్రభాకర రెడ్డి, రమణారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఇందులో భాగంగానే జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్ నాయక్, కార్యదర్శిగా రియాజ్, కోశాధికారిగా మల్లికార్జున, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రంగాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆనంద్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు పారదర్శకంగా అందే విధంగా సహకరిస్తామని పేర్కొన్నారు.

బకెట్‌లో పడి చిన్నారి మృతి

బత్తలపల్లి: ఆడుకుంటూ బాత్‌రూమ్‌లో ఉన్న బకెట్‌లో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని అనంతసాగరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలమేరకు... ఆదెప్ప, పుష్ప దంపతులకు ఇద్దరు కుమార్తెలు (దక్షిత, వర్షిత). శనివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న 18 నెలల వర్షిత బాత్‌రూంలో నీటితో నింపి ఉన్న బకెట్‌లో పడిపోయింది. చిన్నారి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ఇళ్లంతా గాలించారు. బాత్‌రూమ్‌లోని బకెట్‌లో పడిపోయిన విషయం గమనించి వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. వర్షిత మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

మడకశిరలో తాగునీటి కష్టాలు

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న 7వ వార్డు మహిళలు

మడకశిర: పట్టణంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత ఐదేళ్లలో పట్టణంలో తాగునీటికి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సరైన నిర్వహణ లేకపోవడంతో పట్టణ ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని 7వ వార్డు (పాత, కొత్త ఎస్సీ కాలనీలు) మహిళలు ఆదివారం తాగునీటి ఇబ్బందులపై రోడ్డెక్కారు. అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. వారి ఆందోళనతో గంటకు పైగా వాహనాలన్నీ రోడ్డుపైనే నిలిచిపోయాయి. తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. వెంటనే చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కూటమి సర్కారు అనాలోచిత నిర్ణయాలపై ప్రభుత్వ ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. 'ఏరు దాటే వరకూ ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా చంద్రబాబు సర్కారు నిర్ణయాలు ఉన్నాయని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. 117 జీఓ అంశంతో పాటు జీపీఎస్ గెజిట్‌పై నిప్పులు చెరుగుతున్నారు. ఇక.. తల్లికి వందనం అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కూటమి నేతలు.. ఇప్పుడు పట్టించుకోకపోవడంతో తల్లులందరూ పెదవి విరుస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై..
గురువుల గుర్రు!



- అనాలోచిత నిర్ణయాలపై ఉపాధ్యాయుల అసంతృప్తి
- ప్రభుత్వ బడుల్లో బాగా తగ్గిన విద్యార్థుల సంఖ్య
- 117 జీఓ రద్దుపై ఎటూ తేల్చని సర్కారు
- పాత పెన్షన్ విధానంపై మాట తప్పిన చంద్రబాబు

కదిరి: ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'నీకు 15 వేలు.. నీకు 15వేలు' అంటూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు చెప్పిన మాటలకు విద్యార్థుల తల్లులు ఆశపడి తమ పిల్లలను ఈసారి ప్రభుత్వ బడుల్లో కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించారు. అయితే ఈసారి 'తల్లికి వందనం' పథకం అమలు చేయడం కుదరదు అని మంత్రి లోకేష్ ఏకంగా అసెంబ్లీలోనే చెప్పడంతో తల్లులంతా అవాక్కయ్యారు. 'మీ పిల్లల ఫీజులు చెల్లించండి.. లేదంటే టీసీలు తీసుకొని మళ్లీ ప్రభుత్వ బడుల్లో చేర్పించండి' అంటూ వారిపై ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తీసుకొస్తుండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆ నిర్ణయాల కారణంగానే ఈసారి ప్రభుత్వ బడిలో చేరిన వారి సంఖ్య (23 శాతం) కన్నా టీసీలు తీసుకెళ్లిన వారి సంఖ్య మూడింతలు (77 శాతం) ఉందని టీచర్లు అంటున్నారు. ఈ విద్యాసంవత్సరం మొదట్లో జూన్‌లో చేపట్టిన 'నేనూ బడికి పోతా..' కార్యక్రమానికి కూడా పెద్దగా స్పందన రాలేదని చెబుతున్నారు. అందుకే ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా 1,200 మంది దాకా మిగులు టీచర్లు ఉన్నారంటున్నారు.

జీపీఎస్ గెజిట్‌పై ఆగ్రహ జ్వాలలు

పాత పెన్షన్ హామీ అమలుపై అధికారంలోకి వచ్చిన నెల రోజులకే కూటమి ప్రభుత్వం మాట మార్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహంతో ఉన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో ఇచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్) జీఓ నెం.54ను కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం ఏకంగా రాజముద్రతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా గెజిట్ కాపీలను తగలబెడుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నిరసనలకు దిగిన విషయం విదితమే. కూటమి నేతలు ఇంతగా మోసం చేస్తారని తాము అనుకోలేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

ఆగ్రహం తెప్పిస్తున్న అశోక్‌బాబు మాటలు

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీఓ నం.117 విషయంలో మాట మార్చింది. ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని ఉద్యోగ సంఘాల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత అశోక్‌బాబు ఇటీవల మాట్లాడటంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మరి అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ఎలా రద్దు చేశారని ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే జీఓ నం.117ను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి... ఇప్పుడు టీచర్ల సర్దుబాటులో పాఠశాలల విలీనం ప్రస్తావనే లేకుండా మిగులు పోస్టులను నిర్ణయించడమేమిటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతులు లేకుండానే సర్దుబాటు

సాధారణంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తర్వాతనే మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తారు. అయితే దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం అది కూడా విద్యా సంవత్సం మధ్యలో సర్దుబాటు చేయడం ఏంటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి మద్యం, ఇసుక పాలసీలను తీసుకురావడంపై ఉన్న శ్రద్ధ విద్యా వ్యవస్థపై లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	1,159
ప్రాథమికోన్నత పాఠశాలలు	230
ఉన్నత పాఠశాలలు	307
విద్యార్థులు	1,42,327

మెగా డీఎస్సీ లేనట్లే ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ హామీలు గుప్పించారు. అయితే ఇప్పుడు టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు బాబు సర్కారు శ్రీకారం చుట్టడం చూస్తే మెగా డీఎస్సీని కాలయాపన చేసేందుకేనని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం కొన్నింటిపై మాత్రమే సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాకపోతే మరోసారి సర్దుబాటును బహిష్కరిస్తామని టీచర్లు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయాలు సరిగా లేవు



విద్యా వ్యవస్థకు సంబంధించి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఏ ఒక్కటీ సరిగా లేవు. జీపీఎస్ రద్దు, 3, 4, 5 తరగతుల విలీనం వంటి అంశాలపై ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. టీచర్ల సర్దుబాటు విషయంలో కూడా ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తోంది. ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ వైఎస్సార్‌టీఎఫ్ సమర్థించదు.

– పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఎఫ్

117 జీఓ రద్దు చేయాలి



ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రధానంగా 117 జీఓను రద్దు చేయాలి. ఉపాధ్యాయ సంఘాలతో పాటు టీచర్ల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి. జీపీఎస్‌పై ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం శాశ్వతంగా ఉపసంహరించుకోవాలి. తల్లికి వందనం కూడా ఈ విద్యా సంవత్సరంలోనే ఇవ్వాలి. అది కూడా ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకే ఇస్తే మంచిది.

– హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

పారదర్శకంగా సర్దుబాటు



ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించాం. ఉపాధ్యాయులు దీనిపై ఎలాంటి సందేహాలు, అనుమానాలు పెట్టుకోవద్దు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలనూ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. కొన్ని తరగతుల విలీనానికి సంబంధించిన జీఓ నం.117, జీపీఎస్‌కు సంబంధించిన జీఓ నెం.54 అంశాలు ప్రభుత్వ పరిధిలోనివి. వాటిపై కూడా ప్రభుత్వం పునరాలోచిస్తోంది.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

నేడు ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వి.రత్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతులను అర్జీల రూపంలో నేరుగా తమకు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

పుట్టపర్తి టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), సీడాప్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులపై నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు జాబ్ కోర్డినేటర్ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 4 నెలల పాటు రిటైల్ స్టోర్ మేనేజర్ కోర్సు, కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులు. శిక్షణా కాలంలో యూనిఫాం, భోజనం ఉచితంగా అందిస్తారు. ఈ నెల 19, 20 తేదీల్లో అనంతపురంలోని పంగల్‌రోడ్డులో ఉన్న టీటీడీసీలో జరిగే ఇంటర్వ్యూలకు ఆసక్తి ఉన్న వారు హాజరు కావచ్చు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు బయోడేటా ఫారంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్, రేషన్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఉపాధి జాబ్‌కార్డు, మూడు ఫొటోలు వెంట తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 96408 99337లో సంప్రదించవచ్చు.

ఆరు కాళ్ల గొర్రె పిల్ల జననం



వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో ఆరు కాళ్లతో ఓ గొర్రెపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన ఎరికల నల్లప్ప 80 గొర్రెలు, 20 మేకల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం మేపు నుంచి తిరిగి వచ్చిన తర్వాత జీవాలను ఇంటి వద్ద ఉన్న దొడ్డిలో ఉంచాడు. ఆదివారం ఉదయం నిద్రలేచి దొడ్డికి వెళ్లి చూస్తే ఆరు కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల ఎంతో ఆరోగ్యంగా కనిపించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఆరు కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల పైకి లేచేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక పశువైద్యాధికారి దృష్టికి యజమాని తీసుకెళ్లాడు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

- జీఆర్‌పీ నూతన ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు: ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) గుంతకల్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. ఇప్పటివరకూ జీఆర్‌పీ ఎస్పీగా ఉన్న చౌడేశ్వరిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రభుత్వం బదిలీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు అదనపు ఎస్పీగా ఉన్న రాహుల్ మీనాకు పదోన్నతి కల్పించి గుంతకల్లు రైల్వే జిల్లా ఎస్పీగా నియమించింది. దీంతో ఆయన ఆదివారం ఉదయం స్థానిక జీఆర్‌పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనది 2019 ఐపీఎస్ బ్యాచ్ అన్నారు. రెండో పోస్టింగ్‌లో పదోన్నతిపై గుంతకల్లు రైల్వేకు బదిలీ అయినట్లు చెప్పారు. డివిజన్ స్థితిగతులు, సిబ్బంది ఇబ్బందులపై ఆరా తీస్తానన్నారు. సిబ్బంది కొరతపై ఐజీతో మాట్లాడతానన్నారు.



నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న రైల్వే ఎస్పీ రాహుల్

ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించి, పక్కాగా అమలు చేస్తామన్నారు. అనంతరం రైల్వే ఎస్పీ రాహుల్ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్



రథోత్సవంలో కోలాటాన్ని ప్రదర్శిస్తున్న భక్తులు

నేత్రపర్వంగా నగర సంకీర్తన

పుట్టపర్తి రూరల్: పర్తి యాత్ర పేరుతో పుట్టపర్తికి చేరుకున్న ఎన్టీఆర్ జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తన నేత్రపర్వంగా సాగింది. బాబా చిత్రపటాన్ని కొలువుదీర్చిన రథానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పూజలు నిర్వహించి, ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆ జిల్లాకు చెందిన బాలవికాస్ విద్యార్థులు, భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ, భజనలు, కోలాటాలతో రథాన్ని ముందుకు లాగారు. హనుమాన్ సర్కిల్, వాసవీ నివాస్, గోపురం వీధి, ప్రశాంతి నిలయం, విద్యాగిరి వరకూ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమంలో దాదాపు 2 వేల మంది భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు



కదిరి: జలమయమైన వేమారెడ్డి సర్కిల్

- జిల్లాలోని 21 మండలాల్లో వర్షం
- అమరాపురంలో అత్యధికంగా 45.6 మి.మీ
- గాండ్లపెంటలో అత్యల్పంగా 2 మి.మీగా వర్షపాతం నమోదు

పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ వర్షాలు కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా అమరాపురంలో 45.6 మి.మీ, సోమందేపల్లిలో 45.2 , చిలమత్తూరులో 41.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. గుడిబండలో 33.2, రొళ్లలో 32.4, అగళిలో 24.6, తనకల్లులో 24.6, పెనుకొండలో 24.4, మడకశిరలో 23.2, నల్లచెరువులో 22.6, పరిగిలో 18.4, రొద్దంలో 16.4, లేపాక్షిలో 12, గోరంట్లలో 10.4, సీకే పల్లిలో 9.8, రామగిరిలో 8.8, హిందూపురంలో 7.6, ధర్మవరంలో 5.4, ఓడీ చెరువులో 3.4, తలుపులలో 2.8, గాండ్లపెంటలో 2 మి.మీ వర్షం కురిసిందన్నారు.

పంటలు కళకళ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్న వారికి కూడా ఈ వర్షాలు ఎంతో తోడ్పడుతున్నాయి. అయితే ముందస్తు వర్షాలకు బోరు బావుల కింద సాగు చేసిన పంటలు తొలగిస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద పొలంలో నిలిచిన వర్షపు నీరు

పనులకు ఆటంకం

వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ రహదారుల పనులకు అక్కడక్కడా ఆటంకం కలుగుతోంది. రోడ్ల వెంబడి నీళ్లు నిలబడటతో పనులు నిలిచిపోతున్నాయి. కొన్ని చోట్ల వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. గోరంట్ల మండలం ఖాజాపురం వద్ద కంకర మిషన్ తీసుకొస్తున్న భారీ వాహనం రోడ్డు పక్కన ఇరుక్కోవడంతో సుమారు గంట పాటు ధర్మవరం – గోరంట్ల వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. వాహనాన్ని రోడ్డుపై నుంచి తొలగించలేకపోవడంతో పొలాల్లో తాత్కాలిక రోడ్డు తయారు చేసి వాహనాలను పంపారు. క్రెయిన్ తీసుకొచ్చి భారీ వాహనాన్ని తొలగిస్తామని అధికారులు తెలిపారు.

కదిరిలో భారీ వర్షం

కదిరి టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ వర్షం పడింది. దీంతో వేమారెడ్డి సర్కిల్, రాధాకృష్ణ వీధి, కోనేరు సర్కిల్, వలీసాబ్ రోడ్డు, కంచుకోట, మార్కెట్ వీధి, జడలమయ్య మఠం వీధులన్నీ జలమయమయ్యాయి. గంట పాటు కురిసిన వర్షానికి రాజేంద్రప్రసాద్ వీధిలో ఉన్న వెంకటరమణ ఇంటికున్న రేకులు ఎగిరిపోయాయి. దీంతో నిత్యావసర సరుకులు పూర్తిగా తడిసిపోయ్యాయి. ఆర్టీసీ బస్టాండు వద్ద పెద్ద రాగి చెట్టు, కరెంట్ ఆఫీసు , కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో గాలి వానకు పెద్ద చెట్లు విరిగిపడ్డాయి.



గోరంట్ల మండలం ఖాజాపురం వద్ద రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోయిన భారీ వాహనం



కదిరి: ఇంటి రేకులు ఎగిరిపోయిన దృశ్యం



కదిరి: కరెంట్ ఆఫీసులో విరిగిపడిన చెట్లు

క్లుప్తంగా

ఎస్కేయూ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలోని ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వైదేహి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కావేరి హాస్టల్‌లో ఉంటున్న ఆమె శనివారం అర్ధరాత్రి మోతాదుకు మించి ఐరన్ మాత్రలు ఒకేసారి మింగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. తోటి విద్యార్థినులు వెంటనే ఆమెను వర్సిటీ అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఆమె కోలుకుంటున్నట్లు సమాచారం. దీంతో సోమవారం ఉదయం జరిగే వైవాకు ఆమె హాజరు కావచ్చునని వైద్యులు భరోసానిచ్చారు. కాగా, ఆమె ఆత్మహత్యాయత్నాన్ని నెల్లూరులో ఉన్న తల్లిదండ్రులకు వర్సిటీ అధికారులు చేరవేశారు. ఈ అఘాయిత్యానికి గల కారణాలపై స్పష్టత లేదు.

వ్యాపారి ఆత్మహత్య


మృతుడు ఆదినారాయణ

గుంతకల్లు టౌన్: రైల్వేస్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదినారాయణ(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సోనియాగాంధీ కాలనీలో నివాసముంటున్న ఆదినారాయణకు భార్య సుమలత, ముగ్గురు పిల్లలున్నారు. శనివారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. పిల్లలు చేతికొచ్చారని, కష్టపడి సంపాదించిన సొమ్మంతా తాగుడుకే ఖర్చు పెడితే అప్పులు ఎలా తీరుస్తారంటూ ఆ సమయంలో ఆయనను భార్య మందలించింది. దీంతో క్షణికావేశానికి లోనైన ఆదినారాయణ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం సీఐటీయూ కాలనీలో ఉన్న పాత ఇంటికెళ్లి చూస్తే చీరతో వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న ఆదినారాయణ కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైలు పట్టాల పక్కన పడి ఉన్న మృతదేహం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిచెర్ల సమీపంలో రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శరవేగంతో వెళుతున్న రైలు ఢీకొనడంతో తల తెగి పట్టాలపై పడింది. మిగిలిన దేహం పట్టాలకు దూరంగా విసిరేసినట్లుగా పడి ఉంది. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

తారలు దిగివచ్చే వేళ..

బ్యాటుతో రప్ఫాడేస్తారు. పరుగులతో హోరెత్తిస్తారు. కళ్లు చెదిరే సిక్సులు, ఫోర్లతో అలరించేస్తారు. ఎప్పుడూ టీవీలో కనిపించే అలాంటి తారలు మన నగరానికే వస్తున్నారు. వినోదం పంచనున్నారు. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామం దేశవాళీ క్రీడా సంరంభానికి సిద్ధమవుతుండగా, తమ అభిమాన క్రికెటర్ల రాక కోసం క్రికెట్ ప్రేమికులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

- వచ్చే నెల 5 నుంచి దులీప్ ట్రోఫీ
- అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే టోర్నీకి ఆర్డీటీ స్టేడియం సర్వం సిద్ధం
- భారత జట్టులోని ముగ్గురు క్రీడాకారులు మినహా తక్కిన వారందరూ ప్రాతినిధ్యం
- సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, పంత్ తదితర స్టార్ క్రికెటర్ల రాక
- పండుగ చేసుకోనున్న అభిమానులు



దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్న ఆర్డీటీ స్టేడియం

టోర్నీ ప్రారంభమయ్యే తేదీ: సెప్టెంబర్ 5

అనంతలో జరిగే మ్యాచ్‌లు..

సెప్టెంబర్ 5-8:	టీమ్- సీ వర్సెస్ టీమ్-డీ
సెప్టెంబర్ 12-15:	టీమ్-ఏ వర్సెస్ టీమ్-డీ టీమ్-బీ వర్సెస్ టీమ్-సీ
సెప్టెంబర్ 19-22:	టీమ్-బీ వర్సెస్ టీమ్-డీ టీమ్ -ఏ వర్సెస్ టీమ్-సీ

అనంతపురం: దేశవాళీ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలు అనంతపురంలో జరగనున్నాయి. వచ్చే నెల 5న టోర్నీ ప్రారంభం కానుండగా, అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక మ్యాచ్ నాలుగు రోజుల పాటు (మల్టీడే మ్యాచ్) నిర్వహిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో అయితే టెస్ట్ మ్యాచ్‌గా పరిగణిస్తారు. ఒక మ్యాచ్ ఐదు రోజుల పాటు సాగుతుంది.

క్రీడా గ్రామం ఖ్యాతి..

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు తొలిసారిగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తుండడంతో జిల్లా పేరు దేశస్థాయిలో మార్మోగనుంది. 2003లో ప్రారంభించిన ఆర్డీటీ క్రీడా గ్రామం అనతి కాలంలోనే తన కీర్తిని ఇనుమడింపజేసుకుంది. స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలు పాటిస్తుండడంతో దులీప్ ట్రోఫీ నిర్వహణకు అవకాశం దక్కింది. పేద, మధ్య తరగతి క్రీడాకారులకు దన్నుగా నిలుస్తూ ఎంతో మంది ప్రతిభావంతులను క్రీడల వైపు ఆసక్తి పెరిగేలా కృషి చేసిన ఫాదర్ ఫెర్రర్ ఆశయం నెరవేరుతోందని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభిమానులకు పండగే..

టోర్నీ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్, పంత్ తదితర క్రికెట్ స్టార్లు నగరానికి రానున్నారు. తమ ఆటతో అభిమానులను మురిపించనున్నారు. భారత జట్టు క్రికెటర్లలో ముగ్గురు మినహా అందరూ దులీప్ ట్రోఫీలోని జట్లలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో తమ అభిమాన క్రికెటర్ల రాక కోసం యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నగరంలోని రెండు త్రీ స్టార్ హోటళ్లలో భారత క్రికెటర్లకు బస ఏర్పాట్లు చేస్తున్నారు.

దులీప్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించే జట్లు ఇవే..

టీమ్–ఏ: శుభమన్ గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ ధూబే, తనుస్ కోటియన్, కులదీప్ యాదవ్, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్ అహమ్మద్, అవేశ్ ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుషగ్ర, షస్వత్ రావత్.

టీమ్–బీ: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్, ముషీర్ ఖాన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, యశ్ దయాల్, ముకేష్ కుమార్, రాహుల్ చహర్, ఆర్ సాయి కిశోర్, మోహిత్ అశ్విత్, ఎస్. జగదీషన్ (వికెట్ కీపర్)

టీమ్–సీ: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, బి. ఇంద్రజిత్, హార్థిక్ షోకీన్, మనవ్ సుతార్, ఉమ్రాన్ మాలిక్, వైశాఖ్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్ జుయాల్ (వికెట్ కీపర్), సందీప్ వారియర్

టీమ్ –డీ: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వ టైడ్, యష్ దూబే, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రికీ భూయి, షరాన్ష్ జైన్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్‌దేశ్‌పాండే, ఆకాష్ సేన్ గుప్తా, కేఎస్. భరత్ (వికెట్ కీపర్), సౌరభ్ కుమార్.

గర్వకారణం



ఇలాంటి పెద్ద ఈవెంట్ జరగడం అనంతపురం జిల్లా చరిత్రలోనే తొలిసారి. ఇటువంటి మ్యాచ్‌లు జరుగుతాయని ఊహించలేదు. ఇంత మంది స్టార్ క్రికెటర్లు వస్తారని కలలో కూడా అనుకోలేదు. దులీప్ ట్రోఫీ వంటి వాటి నిర్వహణకు కేవలం గ్రౌండ్ ఒక్కటే సరిపోదు. క్రికెటర్లకు అధునాతన సౌకర్యాలు కల్పించాలి. ఇటువంటి టోర్నీల వల్ల జిల్లా క్రికెటర్లకు స్ఫూర్తి కలుగుతుంది. ఆర్డీటీ క్రీడా గ్రామంలో రెండు గ్రౌండ్లు ఉన్నాయి. ఒకే సమయంలో రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. చాలా పెద్ద పని. చాలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అందరి సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేస్తాం. సెప్టెంబర్ 5 నుంచి 22 వరకూ టోర్నీ జరుగుతుంది. భారత జట్టులోని ముగ్గురు క్రీడాకారులు మినహా తక్కిన వారందరూ ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

– మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ మెంబర్

పిడుగు పాటుకు 23 గొర్రెలు, ఆవు మృతి


మృతి చెందిన గొర్రెలు, ఆవు

గాండ్లపెంట: మండలంలోని తుమ్మలబైలు పంచాయతీ పాతినేపల్లికి చెందిన ఊసన్నగారి వెంకటరమణకు చెందిన 25 గొర్రెలు, ఆవు ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాయి. రోజు వారీ కార్యక్రమంలో భాగంగా గొర్రెల మేపునకు తుమ్మలబైలు సమీపంలోని అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఆదివారం ఉన్నఫళంగా పిడుగుల కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో జీవాలు, ఆవు తలదాచుకున్న చెట్టుపై పిడుగు పడడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనతో దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత యజమాని వాపోయాడు.

అ'పూర్వ' సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముదిగుబ్బ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ ఆదివారం కదిరి రోడ్డులోని షాదీ మహల్‌లో ఒక్కటయ్యారు. ఆత్మీయ పలకరింపులతో పులకరించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు ఇమామ్ షరీఫ్, కుళ్లాయిరెడ్డి, చిన్న నారాయణ, చంద్ర నారాయణ, లక్ష్మీనరసమ్మ, మురళీధర్, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డిను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకలోని బళ్లారికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ సమయంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, సౌత్‌క్యాబిన్, ట్విన్‌లైన్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లినట్లు అంగీకరించాడు. దీంతో ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేసి, రూ.2.50 లక్షల విలువైన ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

దోపిడీ రాజ్యంపై దండెత్తాలి

- గద్దర్ వర్ధంతి సభలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


గద్దర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తితో దోపిడీ రాజ్యంపై దండెత్తాలని, మూగబోయిన ఆయన గొంతు నుంచి రాగమందుకోవాల్సింది జనమేనంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. బహుజన యువసేన, సామాజిక న్యాయ ఉద్యమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో గద్దర్ వర్ధంతి సభ నిర్వహించారు. బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశ్వర్ల హరి అధ్యక్షతన జరిగిన ఈ సభకు జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు గద్దర్ కుమార్తె డా.జీ.వెన్నెలమ్మ, అరుణోదయ కళా మండలి అధ్యక్షురాలు విమలక్క, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంత ప్రజా గాయకుడు డా.దాసరి ఆది నారాయణ, సామాజిక న్యాయ ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి శంకర కుళ్లాయప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు జెడ్పీ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, జెడ్పీ ఆవరణలోని సావిత్రీబాయిపూలే విగ్రహానికీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీపీఆర్‌సీ భవన్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డా.జీ.వెన్నెలమ్మ, విమలక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ.. గద్దర్ లేని ప్రజా ఉద్యమాలను ఊహించలేమని, పీడితుల పాలిట శత్రువులైన అన్ని వర్గాల దొరల్ని గద్దర్ తన పాటలతో నిలదీసిన తీరును కొనియాడారు. న్యాయవాది గొని నాగన్న, బోయ నరేంద్ర, పోతుల రాధాకృష్ణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామన్న, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్, విశ్రాంత జడ్జి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి యోగా పోటీలు


ప్రశంసా పత్రం అందుకుంటున్న విజేత

హిందూపురం టౌన్: స్థానిక వివేకానంద యోగాథెరపీ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలను యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. హిందూపురం, ధర్మవరం, ముదిగుబ్బ, పరిగి, లేపాక్షి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన యోగా సాధకులు వివిధ కేటగిరిల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలకు జడ్జిలుగా దివాకర్, గురు రాజారావు, కృష్ణవేణి, తారక రామయ్య, రాజేశ్వరి, సూర్య కుమార్ వ్యవహరించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి కౌన్సిలర్ రమేష్ చేతుల మీదగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే ప్రతిభ చాటిన వారిని సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరాయుడు, సహాధ్యక్షుడు బద్రీనారాయణ, దేవాంగం శంకరప్ప, మాకం బాలాజీ, మహేంద్ర, భారతి, వెంకటేష్, యోగా టీచర్స్ పాల్గొన్నారు.

'పురం'లో వరుస చోరీలు

హిందూపురం: స్థానిక రైల్వే రోడ్డు, ధనలక్ష్మి రోడ్డులోని వేర్వేరు దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున కారులో వచ్చిన నలుగురు దుండుగులు... తొలుత ధనలక్ష్మి రోడ్డులోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలోకి చొరబడ్డారు. దీనిపై నిర్వాహకులు విలువైన సామగ్రి అపహరించుకెళ్లినట్లుగా తెలుపుతున్నా... పోలీసులు మాత్రం ఏమీ చోరీ కాలేదని పేర్కొన్నారు. రైల్వేరోడ్డులోని ఓ దుస్తుల దుకాణంలో ప్రవేశించిన దుండగులు రూ.10 వేల నగదు, 20 జతల రెడీమేడ్ దుస్తులు అపహరించారు. బాధితుల నుంచి సమాచారం అందుకున్న హిందూపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సర్దుబాటు వద్దు... ప్రమోషన్లు కల్పించండి

- హిందూపురం ఎంపీకి ఏపీటీఎఫ్ వినతి


ఎంపీ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు ప్రక్రియ కాకుండా అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేసేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలో హిందూపురం ఎంపీ పార్థసారథిని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీఓలు 117, 128ను రద్దు చేయాలని కోరారు. పాఠశాలల్లో కేవలం ఇంగ్లిష్ మాధ్యమంలోనే కాకుండా తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. కొత్తగా సీబీఎస్‌ఈ సిలబస్‌లోకి మార్చిన పాఠశాలలను తిరిగి స్టేట్ సిలబస్‌కు మార్చేలా చూడాలన్నారు. డిమాండ్లను విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఈ సందర్భంగా వారికి ఎంపీ హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా శాఖ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర, గౌరవ అధ్యక్షుడు పీవీ మాధవ, రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప, నాయకులు నరేష్ కుమార్, సీనియర్ నాయకులు త్రిమూర్తి, శ్రీనివాసులు, మల్లికార్జున, పి రవికుమార్, ఉమాపతి, నాగభూషణ ఉన్నారు.

గుప్తనిధి వేటగాళ్ల అరెస్ట్

- వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ ఆరుగురు
- అందులో ఇద్దరి పరారీ

రాయదుర్గం: గుప్త నిధి వెలికి తీసేందుకు వెళుతున్న ఓ ముఠాను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రాయదుర్గంలోని బళ్లారి మార్గంలో కుంటు మారెమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కేఏ50పీ 7097 నంబరు గల కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఆరుగురితో పాటు గ్యాస్ కట్టర్లు, రెండు గ్యాస్ సిలిండర్లు, గడ్డపారలు, చెలికి, పూజా సామగ్రి, ఓళిగ, కుంకుమ గుర్తించారు. ఈ లోపు దుండగుల్లో ఇద్దరు అక్కడి నుంచి పారిపోవడంతో నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గుప్తనిధి వెలికి తీసేందుకే వారు వెళుతున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించుకున్న పోలీసులు... నిందితులను తమ అదుపులో ఉంచుకుని విచారణ చేస్తున్నారు. కాగా, రాయదుర్గం చదం గ్రామ సమీపంలోని లింగాలబండపై కొలువుదీరిన చతుర్ముఖ పశుపతినాథ ఆలయంలో ఈ నెల 12న రెండు నంది విగ్రహాలను దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దుండగులు... విగ్రహాలు ధ్వంసం చేసిన వారు ఒక్కరేననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దేశంలో నేపాల్ తర్వాత లింగాలబండపై వెలసిన ఈ ఆలయానికి చాలా ప్రాముఖ్యత ఉంది. శివలింగానికి నాలుగువైపులా కొలువుదీరిన నందీశుల విగ్రహాల్లో రెండింటిని దుండగులు ధ్వంసం చేశారు. వాటిలో వజ్రాలు ఉండొచ్చనే అనుమానంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు వదంతులు వ్యాపించాయి. గుప్తనిధులు తవ్వేందుకు వెళుతూ ఆ ప్రాంత సమీపంలోనే దుండగులు పోలీసులకు పట్టుబడడం పశుపతినాథుడి మహిమేనని భక్తులు భావిస్తున్నారు.

అనుబంధాలకు ప్రతీక 'రాఖీ'

సందర్భం : నేడు రాఖీ పౌర్ణమి

ఏటా శ్రావణ పౌర్ణమి వచ్చిందంటే సోదరసోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు నెలకొంటాయి. అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగ రానేవచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లలో వివిధ రకాల రాఖీల విక్రయాలూ ఊపందుకున్నాయి. కులమతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించుకోవడంతో పాటు ద్విజులు తమ యజ్ఞోపవితాలను శాస్త్రోక్తంగా మార్చుకునే ఉపకర్మలు, హయగ్రీవ జయంతి, సత్యదేవుని వ్రతాలు సోమవారం వేడుకగా నిర్వహించుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అన్ని వయస్సుల వారినీ ఆకట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన రాఖీల విక్రయాలు ఊపందుకున్నాయి. – హిందూపురం:


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు


రంగుల పూసలతో తయారు చేసిన రాఖీలు


పిల్లలు ఇష్టపడే కార్టూన్ సీరియల్‌లోని క్యారెక్టర్లతో రూపొందించిన రాఖీలు